క్లుప్తంగా

ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే పాటూరు



చల్లపల్లి: నిడుమోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో పాటూరు రామయ్య ఓటు వేశారు. చల్లపల్లి పూర్వపు జమిందారు శ్రీమంతురాజా యార్లగడ్డ శివ రామ ప్రసాద్ మనుమలు గ్రామంలోని రామ లింగయ్య స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో డైరెక్టర్ వైవీఎస్ చౌదరి



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలుగు సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన వీరు తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి, నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

టెంట్ల తొలగింపు

వక్కలగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి మండలం వక్కలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం పరిధిలో టీడీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టెంట్‌ను పోలీసులు తొలగించారు. సోమవారం పోలింగ్ కేంద్రాల పరిశీలనకు వక్కలగడ్డ వెళ్లిన సీఐ చిన్ని నాగ ప్రసాద్ టెంట్ గమనించి సిబ్బంది సహకారంతో తొలగించారు. 144 సెక్షన్ కచ్చితంగా పాటించాలని సూచించారు.

మోపిదేవిలో ఉద్రిక్తతల నడుమ పోలింగ్

మోపిదేవి: మండల పరిధిలోని 10 గ్రామ సచివాలయాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉద్రిక్తతల నడుమ సాగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 8.30 గంటలకు కూడా కొనసాగుతూనే ఉంది. మెరకనపల్లి, వెంకటాపురం పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో పోలింగ్ మందగించింది. అడపవారిపాలెంలో 131వ బూత్ వద్ద జనసేన నాయకులు దౌర్జన్యానికి దిగడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి బాలశౌరి, అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, కృష్ణ–గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండల పరిధిలోని రావివారిపాలెంకు చెందిన శతాబ్ద వృద్ధురాలు రావి లీలావతమ్మ(101) పోలింగ్ బూత్ వద్ద తమ ఓటును వినియోగించుకున్నారు.

రెండు నెలలు నానా ఇబ్బంది పెట్టారు

ఓ తాతయ్య ఆవేదన



అవనిగడ్డ: ఓటేసి మండుటెండలో కర్రసాయంతో బలవంతంగా నడచి వస్తున్న ఓ వృద్ధుడిని తాతయ్యా ఓటేశారా అని అడిగితే వేశానయ్యా అని సమాధానం చెప్పారు. తాతగారూ మీ పేరేంటని అడిగితే.. బూరగడ్డ కోటేసు, మాది కోడూరు మండలం జయపురం అయితే అవనిగడ్డలో ఉంటున్నాను. నా వయస్సు 82 సంవత్సరాలని చెప్పారు. మీకు పింఛన్ వస్తుందా అని మాటకలుపగా వస్తుందయ్యా.. గత 56 నెలలుగా ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చారయ్యా.. ఆ చంద్రబాబు చేసిన పనులకు రెండు నెలల నుంచి నానా ఇబ్బంది పడుతున్నాను. అందుకే కసి తీర్చుకోవడం కోసం ఇబ్బంది పడుతున్నా ఓటేసి వస్తున్నాను అని సమాధానం ఇచ్చారు.

అవనిగడ్డలో 82.5 శాతం పోలింగ్

అవనిగడ్డ: నియోజకవర్గంలో సోమవారం రాత్రి 11 గంటలకు అందిన సమాచారం మేరకు మొత్తం 82.5 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,12,331 మంది ఓటర్లు ఉండగా రాత్రి 11 గంటల వరకూ 1,75,174 ఓట్లు పోలయ్యాయి. మోపిదేవి మండలం వెంకటాపురంలో విద్యుత్ అంతరాయంతో 10.30 వరకూ పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల పోలింగ్ ఆలస్యం కావడంతో ఇంకా 12 పోలింగ్ స్టేషన్ల సమాచారం రావాల్సి ఉంది. పూర్తి సమాచారం అందితే మరికొంత శాతం పోలింగ్ పెరిగే అవకాశం ఉంది.

ఘంటసాల: మండలంలోని 22 గ్రామాలకు సంబంధించిన 44 పోలింగ్ కేంద్రాల్లో 33,235 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 28,695 మంది ఓట్లు వేయగా 86.34 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు.



కోడూరులో వృద్ధురాలిని బైక్‌పై తీసుకువెళ్తూ..



బంటుమిల్లి గ్రామంలో 150 బూత్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు బారులు తీరిన ఓటర్లు



విశ్వనాథపల్లిలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడికి సాయం అందిస్తున్న పోలీసు

పోటెత్తిన ఓటర్లు

- పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలైన్లు



విశ్వనాథపల్లిలో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకువస్తూ..

కోడూరు: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఉదయం 6.30 గంటల నుంచే ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉన్నారు. మాక్ పోలింగ్ అనంతరం పోలింగ్‌ను ప్రారంభించిన అధికారులు సాయంత్రం వరకు ఓటింగ్ ప్రక్రియను నిర్విరామంగా కొనసాగించారు. ఎండను లెక్క చేయకుండా ఓటర్లు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పోలింగ్‌కు తరలివచ్చి చైతన్యం నింపారు. ఓటర్లకు ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందించారు. ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ శిరీషలు పోలింగ్ సరళిని పరిశీలించారు. బీఎల్వోలు పోలింగ్ సిబ్బందికి సహకారమిస్తూ ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా తోడ్పాటునందించారు.



పెడనలోని మండల పరిషత్ పాఠశాలలో ఓటు వేసేందుకు క్యూలో వేచి వున్న ఓటర్లు

తరలివచ్చిన వృద్ధులు

కోడూరు: వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రజల్లో చైతన్యం నింపారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో వృద్ధులు ఉదయం 6గంటల నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఎనిమిది పదులు వయస్సు దాటిన వారు కూడా ఉత్సాహంగా ఓటింగ్‌కు వచ్చారు. నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులను వీల్‌చైర్‌లో తమ కుటుంబసభ్యులు తీసుకువచ్చి ఓటు వేయించారు. కొంతమంది వృద్ధులకు పోలీసులు, వలంటీర్లు సహాయమందించారు. భారత రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో పోలిస్తే ఇప్పుడు ఓటింగ్ సరళి పూర్తిగా మారిపోయిందని, కాలనుగుణంగా ఓటు విధానం కూడా మారిందని వృద్ధులు తెలిపారు. యువతతో పోటీగా వృద్ధులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకొని భావితరాలకు ఓటు విలువను తెలియజేశారని పలువురు ప్రశంసించారు.

బారులు తీరిన ఓటర్లు

బంటుమిల్లి: మండలంలో 35,409 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వం 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ఓటర్లు ఓటు వేసేందుకు కేంద్రాల బాట పట్టారు. దీంతో కేంద్రాల వద్ద ఓటర్లు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. చోరంపూడి 165 బూతు వద్ద పోలింగ్ మందకొడిగా సాగడంతో పోలింగ్ పూర్తి అయ్యేసరికి రాత్రి దాదాపు 9 గంటలు దాటింది. ఈ కేంద్రం వద్ద కలెక్టరు ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు విద్యుత్ దీపాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. ఎండలో ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లకు నాయకులు మజ్జిగ, చల్లని తాగునీరు టిఫిన్లు ఏర్పాటు చేశారు. మల్లేశ్వరం, చోరంపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో పోలీసులు చెదరగొట్టి వెళ్లగొట్టారు. గతంలో కన్నా ఈ సంవత్సరం మండలంలో సాధారణ ఎన్నికల ప్రశాంతంగా జరగడంతో పోలీసులు కూడా ఊపిరి పీల్చుకున్నారు.

కోడూరులో 86.69 శాతం

కోడూరు: సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం కోడూరు మండలంలో 86.69 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓట్లు వేసేందుకు ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చినట్లు చెప్పారు. మండలంలోని 48 పోలింగ్ బూత్‌ల్లో 36,272మంది ఓటర్లు ఉండగా 31,446 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. సాయంత్రం 6గంటల తరువాత వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. విశ్వనాథపల్లిలోని రెండు పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి 8గంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ చెప్పారు. జయపురంలోని పోలింగ్ బూత్ నెంబర్ 203వ ఈవీఎం మొరాయించడంతో మధ్యాహ్నం సమయంలో అరగంట పాటు ఓటింగ్ ప్రక్రియ నిలిచిందని, టెక్నికల్ సిబ్బంది సమస్యను పరిష్కరించి ఓటింగ్ సజావుగా సాగేలా చేశారన్నారు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు తహసీల్దార్ తెలిపారు.



కోడూరులోని పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఓటర్లు

బందరు మండలంలో..

కోనేరుసెంటర్: బందరు మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం 7 నుంచి మొదలైన పోలింగ్ పలు గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు సాగింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు కొద్దిసేపు మొరాయించినా పోలింగ్ అధికారులు అప్రమత్తం కావడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో వృద్ధులు, మహిళలు, యువతీ, యువకులు ఎండను లెక్కచేయకుండా క్యూలో నిల్చుని ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్

- బందరులో క్యూలో ఓటర్లు
- ఓటు వేసేందుకు మక్కువ చూపిన మహిళలు



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జిల్లా కేంద్రం మచిలీపట్నంలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని 134 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రారంభమయ్యే 7 గంటలకే నగరంలోని ప్రధాన పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఉదయం నుంచి పలు కేంద్రాల్లో ఓటర్లు ఓట్లు వేసేందుకు బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఓట్లు వేయడానికి ఇబ్బంది పడుతూనే రావడం కనిపించింది. మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారు. నగరంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ, ఆయన సతీమణి పృధ్వీక ల్యాణి ఓటు వేశారు. హిందూ కళాశాలలో ఏర్పాటు చేసిన 104 పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), జయసుధ దంపతులు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఓటు హక్కును వినియోగించుకున్నారు. పేర్ని కిట్టు గంటకు పైగా క్యూ లైన్‌లో నిల్చుని ఓటు వేశారు. అనంతరం ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు నగరంలోని పలు బూత్‌లకు వెళ్లి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈడేపల్లిలోని పద్మావతి బీఈడీ కళాశాల, సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్, దేశాయిపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, నిర్మలా హైస్కూల్, కాలేఖాన్‌పేట ఉన్నత పాఠశాల, గాంధీవిద్యాలయం తదితర పోలింగ్ బూత్‌లలో ప్రజలు పెద్దఎత్తున బారులుతీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగరంలోని శంకరమఠం వద్ద ఉన్న 144 పోలింగ్‌బూత్‌లో ఈవీఎం మొరాయించటంతో కొద్దిసేపు పోలింగ్ నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మెడలో పసుపు కండువాలు ధరించి ఓటర్ల మధ్య తిరుగుతున్నా పోలీసులు, ఎన్నికల సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై 'కూటమి' దాడులు

- ఆస్పత్రిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తకు చికిత్స
- పరామర్శించిన పేర్ని నాని, కిట్టు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కార్యకర్తలు రెచ్చిపోయారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మాటలతో రెచ్చగొట్టడం, అకారణంగా అవహేళన చేయడం, కయ్యానికి కాలు దువ్వడం వంటి చర్యలకు పాల్పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఉత్తిపుణ్యానికి దాడులు చేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అకారణంగా చావబాదారు. పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తల కవ్వింపు చర్యలను తట్టుకోలేని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిలకలపూడి సెంటర్‌లోని పాండురంగ మునిసిపల్ హై స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్త వంకా వెంకటేశ్వరరావును కూటమి కార్యకర్తలు రెచ్చగొట్టి అకారణంగా దాడికి పాల్పడ్డారు. పదిమందికిపైగా అతనిపై దాడి చేసి కొట్టటంతో వెంకటేశ్వరరావు పక్కటెముకలు విరగడంతో పాటు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన కుమారుడు బందరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు ఆసుపత్రికి వెళ్లి జరిగిన విషయాన్ని పూర్తిగా తెలుసుకున్నారు. బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. సర్కారు తోటలోని స్పెషల్ మునిసిపల్ పాఠశాల వద్ద కూటమి కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున వివాదం రేగింది. పోలీసులు అక్కడకు చేరుకుని రెండు వర్గాలను అక్కడి నుంచి చెల్లాచెదురు చేశారు. ఘటనలో రెండు వర్గాలకు స్వల్పపాటి గాయాలు అయ్యాయి.



ఆస్పత్రిలో కార్యకర్తను పరామర్శిస్తున్న పేర్ని నాని

అవనిగడ్డలో ఓటేసిన అభ్యర్థులు

అవనిగడ్డ: మచిలీపట్నం పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అవనిగడ్డ గుల్లపచెరువు పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7.05 గంటలకే ఆయన ఓటేశారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మి, కుమారుడు వికాస్, ఆయన శ్రీమతి రవళి స్థానిక జెడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్‌లో క్యూలైన్లో నిలబడి ఓటు వేశారు. జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వంతెన సెంటర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు.

బరితెగించిన జనసేన నేతలు

- అశ్వరావుపాలెంలో క్యూలైన్లోకి వెళ్లి గ్లాసు గుర్తుకు ఓటేయాలని జనసేన మండల కన్వీనర్ శేషుబాబు ప్రచారం
- జనసేన ఎంపీటీసీది అదేతీరు
- పోలీసులు హెచ్చరించినా వైఎస్సార్ సీపీ నేతలపై దౌర్జన్యం

అవనిగడ్డ: ఓటమి భయంతో జనసేన నేతలు రెచ్చిపోయారు. ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి పెద్ద ఎత్తున వృద్ధుల ఓట్లు బలవంతంగా వేశారు. ఆ పార్టీ నాయకులు ఏకంగా క్యూలైన్లలోకి వెళ్లి గ్లాసు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. కొన్నిచోట్ల బలవంతంగా బూత్‌లోకి వెళ్లి ఓట్లేసుకున్నారు. చెప్పేవి శ్రీరంగ నీతులు చేసేవి.. అంటూ వైఎస్సార్ సీపీ నేతలు వారిపై మండిపడ్డారు. అవనిగడ్డ మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో జనసేన మండల కన్వీనర్ గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ కటికల సందీప్ ఏకంగా క్యూలైన్లలోకి వెళ్లి గ్లాసు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. 'సాక్షి' వారిని ఫొటోలు తీయడంతో అక్కడ నుంచి పరారయ్యారు. ఎంపీటీసీ సభ్యుడు కటికల సందీప్ మాత్రం పోలీసులు హెచ్చరించినా పట్టించుకోకుండా పదేపదే పోలింగ్ బూత్‌లోకి వచ్చి కూలైన్లలో ఉన్నవారికి గ్లాసు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. పులిగడ్డ 133వ బూత్‌లో వృద్ధురాలి పేరుతో పదే పదే ఓట్లు వేస్తున్న జనసేన నేత మండలి శివప్రసాద్‌కు అడ్డు చెప్పినందుకు వైఎస్సార్ సీపీ మండలి దినేష్‌పై దౌర్జన్యానికి దిగాడు. పదే పదే కొంతమంది యువతులు పోలింగ్ బూత్‌లోకి రావడాన్ని గుర్తించిన పోలీసులు తీవ్రంగా హెచ్చరించడంతో సర్దుకున్నారు. మోదుమూడి పోలింగ్ బూత్‌తో సర్పంచ్ భర్త బచ్చు నారాయణ కుమారుడు, కొంతమంది యువకులు, మైనర్లు పోలింగ్ బూత్‌ల వద్ద హల్‌చల్ చేశారు. కొంతమంది వృద్ధులను పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లి ఓట్లేయించారు.



పులిగడ్డలో రెచ్చిపోతున్న జనసేన నేత శివప్రసాద్

పెడనలో పెరిగిన పోలింగ్ శాతం

రాత్రి 8 గంటల వరకు నమోదైన పోలింగ్ 86.18 శాతం

పెడన: నియోజకవర్గంలో గత సార్వత్రిక ఎన్నికలు కంటే ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. గత ఎన్నికల సమయంలో 82.16 శాతం నమోదు కాగా పోలింగ్ రోజు రాత్రి 8 గంటల వరకు నమోదైన పోలింగ్ శాతం 86.18 శాతం నమోదైంది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటలకు చాలా పోలింగ్ కేంద్రాల్లో ఆ ప్రక్రియ ముగియగా పెడన పట్టణంతో పాటు పెడన మండలం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఇంకా జరుగుతూనే ఉంది. పెడన పట్టణంలోని 117 బంగ్లా స్కూలులో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలోనే ఈవీఎం మొరాయించింది. కృత్తివెన్ను మండలంలో 210, 214 పోలింగ్ కేంద్రాల్లో (చినగొల్లపాలెం)లో ఈవీఎంలు మొరాయించాయి. వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పెడన మండలం కూడూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పెడన మండలం నందిగామ జెడ్పీహెచ్ఎస్‌లో బారులు తీరిన ఓటర్లు



గూడూరులోని 35వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

కృత్తివెన్ను: మండలంలో 80% పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీటిలో 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్‌లోనూ కుట్రలు

గూడూరు: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో కూటమి నేతలు కుట్రలకు దిగారు. గూడూరులో వైఎస్సార్ సీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ స్టేషన్ నుంచి బయటకు పంపేందుకు కుట్రలు పన్నారు. గూడూరు జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా నియమితులైన వారు గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్నారని, వారి రాజీనామాలు ఆమోదం పొందలేదని, వారిని బయటకు పంపాలంటూ పోలింగ్ అధికారులను అడ్డుకున్నారు. దీంతో పోలింగ్ అధికారులు వారిని బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, గొరిపర్తి రవిలు ఎంపీడీతో సంప్రదించి వలంటీర్ల రాజీనామాలు ఆమోదించిన జాబితాలు రప్పించారు. వాటిని పోలింగ్ అధికారులకు సమర్పించాక గానీ మళ్లీ ఏజెంట్లను లోనికి రానివ్వలేదు. తుమ్మలపాలెంలో ఓటర్లకు చూపు సమస్య ఉందంటూ సాకు చూపి కూటమి నాయకులు వారితో పాటు పోలింగ్ బూత్‌లోకి చొరబడి తమకు అనుకూలంగా ఓట్లు వేయించుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఇండిపెండెంట్ అభ్యర్థి కాగిత శ్రీ హరి కృష్ణ ప్రసాద్ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఆందోళనకు దిగారు. కూటమి నేతలకు వ్యతిరేకంగా ఇచ్చిన ఫిర్యాదుపై పోలింగ్ అధికారి వ్యవహరించిన తీరుతో అసంతృప్తి వ్యక్తం చేసిన శ్రీహరికృష్ణ ప్రసాద్ పోలింగ్ బూత్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అప్పటికి గానీ పోలింగ్ అధికారి తీసుకున్న ఫిర్యాదుకు సంబంధించి ఎక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వలేదు. వీటపై రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు చేయనున్నట్లు కృష్ణప్రసాద్ వెల్లడించారు. కోకనారాయణపాలెంలో పోలింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన బూరగడ్డ శ్రీనాథ్‌ను స్థానిక కూటమి నాయకులు అడ్డుకున్నారు.